


**జిల్లాను అభివృద్ధిలో ముందుంచాలి : జెడ్‌పి చైర్మన్**


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 19 జూన్, 2024 | పేజీలు : 04


# ముందు మురిపించి...

# ముఖం చాటేసిన వరుణుడు



### ఆందోళనలో అన్నదాత

**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** ముందు మురిపించిన వరుణుడు ఒక్కసారిగా ముఖం చాటేశాడు. ఈనెల మొదటి వారంలో ఒకటి రెండు వర్షాలు కురియడంతో రైతులు మెట్ట పంటల సాగును మొదలు పెట్టారు. కొందరు విత్తనాలు నాటగా మరి కొందరు ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకోని వానల కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొంది. వేసిన విత్తనాలు మొలక ఎత్తక... అదును దాటుతున్నా మరి కొంత మంది అన్నదాతలు విత్తనాలు నాటక ఆందోళన చెందుతున్నారు.

గత ఏడాది కన్నా ఈ ఏడాది భారీ వర్షపాతం నమోదు అవుతుందని వాతావరణ శాఖ ముందుగానే ప్రకటించడంతో అన్నదాతలు మురిసిపోయారు. వారి ప్రకటనకు అనుగుణంగా ఒకటి రెండు వానలు ముందుగానే కురవడంతో ఖరీఫ్ సాగుకు రఢీ అయ్యారు. మెట్ట భూములను చదును చేసి కొంత మంది విత్తనాలు కూడా నాటారు. మరి కొంత మంది రైతులు విత్తనాలను నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ లోపు వరుణుడు ముఖం చాటేయడంతో ఆకాశంవైపు వానల కోసం ఎదురూ చూస్తున్నా పరిస్థితి సూర్యాపేట జిల్లాలో నెలకొంది. వానలు సమృద్దిగా పడుతాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తుగానే పంట సాగు ప్రణాళికను ప్రకటించారు. గత ఖరీఫ్ కన్నా 22,688 ఎకరాల్లో పంట సాగు అధికంగా ఉంటుందని చెప్పారు. వరి సాగు తరువాత రైతులు రెండవ ప్రధాన పంటగా పత్తిని సాగు చేస్తున్నారు. వరి సాగు 4,65,500 ఎకరాలు కాగా 90వేల ఎకరాల్లో పత్తి పంట సాగు అవుతుందని అంచన వేశారు. అలాగే పెసరా 1500 ఎకరాలు, వేరుశనగ 400 ఎకరాలు, మిర్చి 21,000, చెరుకు 300 ఎకరాలు, ఆయిల్ ఫాం 2200 ఎకరాలు, కంది పంట 2400 ఎకరాలు, మొక్కజోన్న 75 ఎకరాల్లో సాగు కానుందని చెప్పారు. ఇందులో రైతులు ఇప్పటికే 50వేల ఎకరాల్లో పత్తి పంట సాగు కోసం విత్తనాలు నాటారు. జిల్లాలోని తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల పరిధిలో పత్తి విత్తనాలు అధికంగా నాటారు. ఈ ప్రాంతాల్లో నల్లరేగడి భూములు అధికంగా ఉండడంతో భూమి పదున నిలుస్తుందని, వానలు కూడా కురుస్తాయనే ఆశతో విత్తనాలను నాటారు. సూర్యాపేట నియోజకవర్గ పరిధిలో ఎర్రనేల భూములు ఎక్కువగా ఉండడంతో వేసిన విత్తనాలు మొలక ఎత్తకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరి కొంత మంది రైతులు వానలు సమృద్దిగా పడితేనే విత్తనాలు నాటుదామని అన్ని సిద్ధం చేసుకోని ఉన్నారు. కాని వరుణుడు కరుణించకపోవడంతో వానల కోసం ఆకాశంవైపు ఆశగా ఎదురూ చూస్తున్నారు. పత్తి పంట సాగు పరిస్థితి ఇలా ఉంటే మెట్ట పంట సాగు అయిన పెసర, కంది, మొక్కజోన్న, వేరుశనగ పంటల సాగు వానలు లేక ముందుకు సాగడం లేదు. గత రెండు మూడు రోజులాగా పగటిపూడ ఎండలు తీవ్రంగా ఉన్న సాయంత్రం సమయానికి కారు మబ్బుల కమ్ముకోవడంతో వాన కురుస్తుందని అన్నదాత ఆశగా ఆకాశంవైపు ఎదురు చూస్తున్నా వానలు మాత్రం పడడం లేదు. వరుణదేవుడు కరుణిస్తే తప్పా రైతులు పంట సాగు చేసుకునే పరిస్థితి కనబడడం లేదు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



### ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం/దేవరకొండ :** అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్లకు వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ. 10లక్షలు, హెల్పర్లకు రూ. 5లక్షలు ఇవ్వాలని ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని సిడిపివో కార్యాలయంలో మెమోరండం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటి సభ్యురాలు శాంతాబాయి మాట్లాడుతూ గతంలో 24 రోజుల సమ్మె చేసినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతామని, వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని వాటిని వెంటనే అమలు చేయాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో చెప్పిన విధంగా నెలకు రూ. 18వేల వేతనాలు చెల్లించాలని, గతంలో 24 రోజుల సమ్మె చేస్తే నేటికి సమ్మె కాలం వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు పనిభారం పెరుగుతుంది తప్ప వేతనాలు పెరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడం వల్ల వారికి ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని, ప్రభుత్వం ప్రవేశపెట్టే అన్ని సంక్షేమ పథకాలకు అంగన్‌వాడీ టీచర్లను ఆయాలను అర్హులుగా ప్రకటించాలని కోరారు. నూతన ప్రభుత్వం తక్షణమే అంగన్‌వాడీలతో చర్చలు జరిపి వేతనాలు పెంచి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు మణెమ్మ, భాగ్య, స్వప్న, భాగ్యలక్ష్మి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ ఇసుకలో అక్రమాలు

### దొరికితే దొంగ... దొరకకపోతే దొర!

### పోలీసుల చేతికి చిక్కిన ఇసుక అక్రమ రవాణా దళారులు

### ఘర్షణలకు దారితీస్తున్న అక్రమ ఇసుక రవాణా



**ప్రజాపక్షం/ హాలియా :** ఆన్‌లైన్ ఇసుక ప్రారంభిస్తే అక్రమ ఇసుక రవాణా చేసే దళారులకు పండగే. గత కొన్ని రోజులుగా ఆన్‌లైన్ ఇసుక నిలిపివేయడంతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిని మైనింగ్ అధికారులు వలపట్టి పట్టుకొని కేసులు నమోదు చేశారు. దీంతో నాలుగు రోజులపాటు అక్రమ ఇసుక దందాకు అడ్డుకట్ట పడింది. తాజాగా పాలెం రీచ్ లో ఆన్‌లైన్ ఇసుక ప్రారంభించడంతో ఆన్‌లైన్ పేరు నమోదు లేని ట్రాక్టర్లు కూడా సందట్లో సడేమియాలా ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడుతున్నారు. ఒక రీచ్ లో ఆన్‌లైన్ ఇసుకను ఓపెన్ చేస్తే ఆ పరిధిలో ఎన్ని ట్రాక్టర్లు ఉన్నాయో ముందుగానే రీచ్ ను పరిశీలించే మైనింగ్ అధికారులు పోలీసులకు సమాచారం అందజేస్తున్నారు. అయితే ఏమాత్రం పలుకుబడి లేని కొంతమంది ట్రాక్టర్ యజమానులు ధైర్యం చేసి అక్రమ ఇసుక రవాణా చేయకుండా మిన్నకుంటున్నారు. కానీ ఆన్‌లైన్‌లో నమోదు లేని ట్రాక్టర్లు కొన్ని గుట్టు చప్పుడు కాకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ట్రాక్టర్లతో పాటు వీరు కూడా ఇసుకను పోసుకొని అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్న కొంతమంది ట్రాక్టర్ అభిమానులు ఆన్‌లైన్‌లో అనుమతి లేని ట్రాక్టర్లు కూడా అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు ఆన్‌లైన్‌లో నమోదు కానీ ట్రాక్టర్లు కూడా ఇసుక రవాణా చేస్తున్న సంగతిని గుర్తించి వారిని పట్టుకుని కేసులను నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం కూడా పాలెం గ్రామం నుండి ఆన్‌లైన్ పేరుతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్ యజమాని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. హాలియా పరిధిలో ఉన్న ఇసుక రీచులను ఓపెన్ చేసే సమయంలో మైనింగ్ శాఖ అధికారులు ఆయా రీచులలో ఆన్‌లైన్‌లో నమోదైన ట్రాక్టర్ల వివరాలను పోలీస్ శాఖ వారికి అందజేస్తే ఈ అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. విచ్చలవిడిగా నడుస్తున్న అక్రమ ఇసుక రవాణా మూలంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద ప్రజలకు ఇసుక అందని ద్రాక్షగానే మారింది. ఆన్‌లైన్‌లో మాత్రమే ఇసుకను బుక్ చేసుకున్న వారికి దశలవారీగా వాటిని సరఫరా చేసినట్లయితే అందరికీ ఇసుక అందుబాటులోకి వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు మైనింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో సాధ్యాసాధ్యాలను పరిశీలన చేసి అందరికీ ఇసుక అందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



## అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల వేతనాల పెంపుకై, రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ. 10లక్షలు, హెల్పర్లకు రూ. 5లక్షలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కోట్ల శోభ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సిడిపివో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో 24 రోజులు సమ్మె చేసిన పుడు అప్పుడు కాంగ్రెస్ పార్టీ రిటైర్మెంట్ బెనిఫిట్స్, వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని ఆ హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లు అంగన్‌వాడీల వేతనం రూ. 18వేలకు పెంచాలని అన్నారు. తక్షణమే వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ప్రాజెక్టు నాయకులు అంజలి, బొడ్డుపల్లి విజయలక్ష్మీ, పద్మ, విజయ, భారతమ్మ, కవిత తదితరులు ఉన్నారు. త



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** రాష్ట్రంలో అంగన్‌వాడిలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకుడు బంటు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పట్టణంలో సీడీపీవోకు ఆయన వినతిపత్రం అందచేసి మాట్లాడారు. అంగన్‌వాడి టీచర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు ఇవ్వాలని, ఎన్నికల హామి మేరకు రూ.18వేల వేతనం అందించాలని, సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని, అంగన్‌వాడిలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలన్నారు. వెబ్‌సైట్‌లో సవరణ చేసి గౌరవ వేతనం పొందుతున్న టీచర్లకు, ఆయాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్ని వర్తింప చేయాలన్నారు. అంగన్‌వాడి టీచర్లు, ఆయాల భర్తీలో కారుణ్య నియామకాలు జరపాలన్నారు. కార్యక్రమంలో రవి, వనజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## అక్రమార్కుల నుంచి చెరువును కాపాడాలి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** అక్రమార్కుల నుంచి చెరువు భూములను కాపాడాలని దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామస్థులు కోరుతున్నారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వారు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. కొండ్రపోల్ గ్రామంలో సుమారు 176.30 ఎకరాల్లో చెరువు విస్తీర్ణం ఉండగా కొందరు అక్రమార్కులు సుమారు 50 ఎకరాల మేరా ఆక్రమించుకోవడంతో చెరువు విస్తీర్ణం తగ్గిందన్నారు. దీంతో చెరువులో నీటి సామర్థ్యం తగ్గి భూగర్భజలాలు అడుగంటాయన్నారు. చెరువు కింద వెయ్యి ఎకరాల్లో సాగు చేసుకుంటున్న రైతులకు నీరు అందకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని, మత్స్యకారులు ఉపాది కోల్పోతున్నారని, గృహాల్లో వేసుకున్న బోర్లలో నీరు రావడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చెరువుకు సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించి చెరువును కాపాడాలని కోరారు. కార్యక్రమంలో మట్టారెడ్డి, పాపయ్య, రవితేజ, వెంకన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చండూరు ఎంపిపిగా అవ్వారు గీత శ్రీనివాసులు

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మండల ఎంపిపిగా గట్టుప్పల 1 ఎంపిటిసి సభ్యురాలు (బిఆర్‌ఎస్) అవ్వారు గీత శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. మంగళవారం చండూరు ఎంపిడిఓ కార్యాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఎంపిపి ఎన్నికకు చండూరు ఆర్డీఓ సుబ్రమణ్యం హాజరై ఎంపిపి ఎన్నికను నిర్వహించారు. మండలంలో మొత్తం 11 మంది ఎంపిటిసిలు ఉండగా అందులో పుల్లెంల ఎంపిటిసి మందడి నర్సింమ్మారెడ్డి (సిపిఐ) గత సంవత్సరం గుండెపోటుతో ఆకాల మరణం చెందారు. ఎంపిపిగా ఉన్న పల్లె కళ్యాణిరవికుమార్‌పై ఎంపిటిసి సభ్యులు అందరు ముక్కుమ్మడిగా అవిశ్వాసం తీర్మాణం ప్రవేశపెట్టారు. వెంటనే ఎంపిపిగా ఉన్న పల్లె కళ్యాణిరవికుమార్ తన ఎంపిపి పదవికి రాజీనామ చేయడంతో ఎంపిపి ఎన్నిక అనివార్యమైంది. ప్రస్తుతం చండూరు మండలంలో 10 మంది ఎంపిటిసి సభ్యులు ఉండగా అందులో బిఆర్‌ఎస్‌కు చెందిన ఐదుగురు ఎంపిటిసి సభ్యులు మాత్రమే మంగళవారం నిర్వహించిన ఎంపిపి ఎన్నికలో పాల్గొన్నారు. తేరటుపల్లి ఎంపిటిసి సభ్యుడు ఎంపిపిగా అవ్వారు గీత శ్రీనివాసును ప్రతిపాధించగా , గట్టుప్పల 2 ఎంపిటిసి చెరుపల్లి భాస్కర్ బలపర్చాడు. ఎంపిపికి ఇంకెవ్వరు పోటీలో లేకపోవడంతో అవ్వారు గీత శ్రీనివాస్ ఎంపిపి గా



ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆర్డీఓ సుబ్రమణ్యం ప్రకటించి ఎన్నిక ప్రతంను అందజేశారు. వెంటనే ఎంపిపిగా ఎన్నికైన గీతశ్రీనివాసులుచే పదవి ప్రమాణ స్వీకరం చేయించారు. ఎంపిడిఓ అనురాధ, డిప్యూటీ తహసీల్ధార్ దీపక్, సూపరిండెంట్ మనోహార్, ఎస్ఐ సురేష్ , ఎంపిటిసి సభ్యులు అవ్వారు గీతశ్రీనివాసులు, చెరుపల్లి భాస్కర్, గొరిగె సత్తయ్య, కావలి మంగమ్మ ప్రసాద్, తిప్పర్తి లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

**మండల ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేస్తా : ఎంపిపి గీతశ్రీనివాసులు**

చండూరు మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజా సేవచేస్తానని నూతనంగా ఎన్నికైన అవ్వారు గీతశ్రీనివాసులు తెలిపారు. తనను ఎంపిపిగా ఎన్నుకున్నందుకు తోటి ఎంపిటిసి సభ్యులకు, సహకరించిన నాయకులకు ఆమే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## దేవరకొండ ఖిల్లా, పట్టణ అభివృద్ధి కోసం కృషి చేస్తా

### ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ ఖిల్లా, పట్టణ అభివృద్ధి కోసం కృషి చేస్తానని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 1, 15, 16, 13వ వార్డులలో పర్యటించి పాత బజార్‌లో ప్రభుత్వ కార్యాలయం నిర్మాణం కోసం పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను పరిశీలించి, పలు వార్డుల సమస్యలను అడిగి తెలుసుకొని సంబందించిన అధికారులను ఆదేశించారు. పట్టణ వార్డుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతి వార్డులో కావాల్సిన సిపి రోడ్లు, డ్రైనేజిలు, విద్యుత్ తో పాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం పట్టణాల అభివృద్ధి కి ఎంతో ప్రాధాన్యత కల్పిస్తున్న తరుణంలో పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అవసరమైన పనులను చేయనున్నట్లు తెలిపారు. వచ్చే నెల వరకు ఖిల్లా గుట్ట పార్కింగ్ పనులు పూర్తి



చేయాలని, మైనార్టీ షాదీఖానా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఖిల్లా బాయి పునరుద్దరణ చేయాలని, డ్రైనేజి వాటర్ ఎస్‌టిపి వద్ద నీటిని శుద్ధి చేసి పట్టణ ప్రగతి పార్కులకు నీటిని వాడుకోవాలని అన్నారు. పట్టణాభివృద్ధికి అధికారుల పనితీరు ఎంతో ముఖ్యమని అందుకోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, వైస్ చైర్మన్ రహాత్‌అలి, పున్న వెంకటేశ్వర్లు, హరికృష్ణ, రాంసింగ్, వెంకటేష్‌గౌడ్, భూదేవి, జయప్రకాశ్, మురళీ, నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు రోజుల వ్యవధిలో ఇద్దరు ఉన్నతాధికారుల బదిలీ

### నూతనంగా జిల్లాకు వచ్చిన కలెక్టర్, ఎస్‌పి

**ప్రజాపక్షం/నల్లగొండ :** పార్లమెంటు ఎన్నికల అనంతరం ఉన్నత అధికారుల స్థానచలన పర్వం కొనసాగింది. నల్లగొండ జిల్లాలో కలెక్టర్‌గా దాసరి హరిచందన, ఎస్‌పిగా చందనా దీప్తిలు పని చేశారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్, ఎస్‌పిల బదిలీల్లో భాగంగా ఈ ఇద్దరు మహిళా అధికారులు బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఆరు నెలల క్రితం ఎస్‌పి చందనా దీప్తి వచ్చిన కొద్ది రోజులలోనే కలెక్టర్ హరిచందన నల్లగొండకు రావడంతో ఇద్దరు మహిళలే కలెక్టర్‌గా, ఎస్‌పిగా జిల్లాను సమగ్రంగా పాలనచేయడంలో కీలక పాత్ర పోషించారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పాటు పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు కూడా వీరి హాయాంలోనే జరిగాయి. అయితే ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతలు కాపాడటంలో, నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కూడా వీరి





హాయాంలోనే సాఫీగా సాగింది. అయితే జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన హరిచందన ఈ నెల 15వ తేదీన బదిలీ కావడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సి.నారాయణరెడ్డి వికారాబాద్ జిల్లా నుంచి నల్లగొండకు బదిలీపై వచ్చి ఈ నెల 16న బాధ్యతలు చేపట్టారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల వ్యవధిలోనే జిల్లా ఎస్‌పి చందనా దీప్తి రైల్వే ఎస్‌పిగా బదిలీ కావడంతో ఆమె స్థానంలో శరత్ చంద్ర పవార్ వచ్చి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అయితే ఏకకాలంలో ఉన్నతాధికారులు ఒకేసారి బదిలీ కావడం చర్చాంశంగా మారింది.

## నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/అనంతగిరి:** ఈ నెల 20న జరగబోయే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అనంతగిరి పిహెచ్‌సి వైద్యాధికారి రంజిత్ కుమార్ ఆరోగ్య,ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడి టీచర్లను కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పిహెచ్‌సి కేంద్రంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా డాక్టర్ రంజిత్‌కుమార్ వా



రికి శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా 119 సంవత్సరాల వయస్సు గల వారందరికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. 12 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికి సగం మాత్రను నీళ్లలో కలిపి ఇవ్వాలని,23 సంవత్సరాల వయస్సుల గల పిల్లలకు పూర్తి మాత్రను నీళ్లలో కలిపి అంగన్‌వాడి కేంద్రాల్లో వేయాలన్నారు. ఆల్బెండజోల్ మాత్రలను అంగన్‌వాడి కేంద్రాల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు డాక్టర్ తెలిపారు. అరోగ్య, ఆ శా కార్యకర్తలు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## 28న డిండి ప్రాజెక్టు నీటి విడుదల

**ప్రజాపక్షం/డిండి :** డిండి మండల రైతాంగానికి జీవనాదారమైన డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు వానాకాలం పంటకు సాగు నీరు విడుదల చేసేందుకు ఈనెల 28న దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ ముఖ్యఅతిధిగా హాజరై డిండి ప్రాజెక్టు నీటిని విడుదల చేయనున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో సబ్బండ వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతు బంధు ఇవ్వడానికి, రైతు రుణాలు మాఫీ చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జెండగె



**ప్రజాపక్షం/గుండాల :** యాద్రాది భువనగిరి జిల్లా గుండాల మండల తహశీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ జెండగె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి దాదాపు 300 పెండింగ్ ఫైళ్లను పరిశీలించి వాటిని త్వరితగతిన పూర్తిచేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. యుద్ధ ప్రాతిపదికను పెండింగ్ ఫైళ్లను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్న తనకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన జిల్లా కలెక్టర్‌ను కలిసిన సిపిఐ నేతలు



**ప్రజాపక్షం /నల్లగొండ :** నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణరెడ్డిని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం నేతృత్వంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని అయన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు బొల్లగూరి నర్సింహా, టి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## 7 ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు



**ప్రజాపక్షం/(మునుగోడు) నల్లగొండ :** మండలంలోని కొరటికల్ వాగు నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 7 ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ ట్రాక్టర్లను స్థానిక పోలీస్ స్టేషన్ తరలించి 7 ట్రాక్టర్ల ను సీజు చేసి కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## వర్షాలు పడాలని ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** మండలంలోని చెర్వు గట్టు గ్రామంలో పంట కాలం వర్షాలు పడక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వర్షాలు కూరవాలని ఊళ్ళో బొడ్రాయి కి, గ్రామ దేవుళ్ళకు నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ చీర మల్లేష్,చీర బిక్షం,బండ లింగయ్య,కడగంచి శంకర్, మోటే లక్ష్మణ్,మందుల నర్సింహా,కోడూరి మల్లయ్య,గంట శేఖర్,చీర శంకర్, మిర్యాల రమేష్,దయ్యల స్వామి,చీర నరేష్, కప్పే శ్రీశైలం,కోడూరి శివ, మచ్చ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రిని కలిసిన ఉపసర్పంచ్



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును మంగళవారం మండలంలోని తిమ్మాపురం గ్రామా ఉపసర్పంచ్ దండు యాదగిరి మర్యాదపూర్వకంగా ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కలిసారు. అనంతరం పుష్పగుచ్చం అందజేశారు. బిఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చేలా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ కమిటీ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా నూతన కలెక్టర్, రెడ్ క్రాస్ అధ్యక్షులు సి నారాయణ రెడ్డి జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి కలిసి పుష్పగుచ్చం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉన్నటువంటి నారాయణరెడ్డి జిల్లాకు కలెక్టర్‌గా రావడం చాలా సంతోషకరమని వారి హయాంలో జిల్లా అభివృద్ధి చెందగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ డాక్టర్ పుల్లారావు, కోశాధికార మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మేనేజింగ్ కమిటీ మెంబర్స్ ఊరుకొండ ప్రభాకర్ రెడ్డి, జల్లా దశరథ, సూరెడ్డి సరస్వతి, కంభంపాటి కోటేశ్వరరావు, రెడ్ క్రాస్ మెంబ ర్ రాంబాబు, తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడిగా వల్లపు దాసు నాగయ్య



**ప్రజాపక్షం/వేములపల్లి :** మాదిగ కుల హక్కుల కోసం పోరాటం చేస్తున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నల్లగొండ జిల్లా కమిటీ ఆదేశాల మేరకు మంగళవారం వేములపల్లి మండల అధ్యక్షులుగా వల్లపుదాస్ నాగయ్యను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తూ జాతి కోసం జాతి అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు.అదేవిధంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించి వచ్చే నెల జులై 07నాటికి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్బంగా మహా జననేత మందకృష్ణ మాదిగ అధ్యక్షతన 2024 జూలై 7వ ఛలో వరంగల్ మాదిగల ఆత్మగౌరవ కవాతు ను విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ మండల కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్,ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఇరుగు శ్రీశైలం, మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్చార్జి మచ్చ ఏడుకొండలు,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## లైంగిక వేధింపులకు పాల్పడితే ఐసిసికి ఫిర్యాదు చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే అంతర్గత ఫిర్యాదుల కమిటీ(ఐసిసి)కి ఫిర్యాదు చేయాలని మహిళా సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ చైతన్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వసుందర షాపింగ్ మాల్‌లో పని చేస్తున్న మహిళ ఉద్యోగులకు మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది మంది కంటే ఎక్కువ మంది మహిళలు ఒకే ప్రదేశంలో పని చేస్తే అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు కార్పోరేట్ సంస్థలు, షాపింగ్ మాల్‌లో పని చేసే మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే 3నెలల లోపు ఎప్పుడైన ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచి వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేలా ఐసిసి కమిటీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో షాపింగ్‌మాల్ మేనేజర్ రవి, మహిళ సాధికారత కేంద్రం సిబ్బంది రేవతి, వినోద్, తేజశ్వీని, షాపింగ్ మాల్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## నియామక తేదీ నుండి సర్వీసును పరిగణలో తీసుకోవాలి



**ప్రజాపక్షం/మోతె:** ఉపాధ్యాయులకు నియామకం తేదీ నుండి సర్వీసును పరిగణలో తీసుకోని ప్రమోషన్ కల్పించాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కేతావత్ గోవింద్ నాయక్, ధరావత్ మోతీలాల్ నాయక్‌లు అన్నారు. మంగళవారం మండలంలోని రాయిపహడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సంఘం ఆధ్వర్యంలో భోజన విరామ సంయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ఉపాధ్యాయులకు డిఎస్‌సి ఎన్ ట్రైన్డ్ ద్వారా నియామకం చేపట్టి, ప్రభుత్వమే కాలయాపన చేసి 2000, 2001, 2002 డిఎస్‌సిలో నియామకమైన ఉపాధ్యాయులకు 2005లో సెలవు రోజుల్లో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కాని సర్వీసు మాత్రం నియామకం తేదీ నుండి ఇస్తున్నప్పటికి ప్రమోషన్లు మాత్రం శిక్షణ కాలాన్ని పరిగణలో తీసుకోవడంతో గిరిజన, హరిజన ఉపాధ్యాయులు నష్టపోతున్నట్లు తెలిపారు. వెంటనే ప్రభుత్వం నియామక తేదీని పరిగణలో తీసుకోని ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆయా మండలాలు బాధ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పొంచి ఉన్న పెను ముప్పు.. తస్మాత్ జాగ్రత్త



**ప్రజాపక్షం/నందికొండ :** నందికొండ మున్సిపాలిటీ స్థానిక హిల్ కాలనీ లోని ఫిల్టర్ హౌస్ ఎదురుగా జాతీయ రహదారి 565 పక్కనే రెండు ఎండిపోయిన భారీ వృక్షాలు విరగటానికి సిద్ధంగా ఉన్నాయి. ఇది ఊరికి దూరంగా ఎక్కడో ఉంటే ఎటువంటి సమస్య ఉండదు అది జాతీయ రహదారి 565 ఆ రహదారికి అడుగు దూరంలో వృక్షము, ఆ వృక్షానికి అతి సమీపంలో హై టెన్షన్ విద్యుత్ వైర్లు ఉండటం అసలు సమస్య. ఇది చెన్నై, హైదరాబాద్, కర్ణాట కవైపు వెళ్లే వాహనాలకు ప్రధాన రహదారి కావడం, అందునా పర్యాటక కేంద్రం కావటంతో నిత్యం విహార యాత్రికులు, అనే క తేలికపాటి వాహనాలు, భారీ వాహనాలు, అతి భారీ వాహనాలు, స్కూలు బస్సులతో పాటు నిత్యం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులు ప్రయాణికులతో అత్యంత రద్దీగా రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఈ రహదారి పై న హై టెన్షన్ విద్యుత్ వైర్లు ఆ వైర్లకు అడుగు దూరం ఎత్తులో ఎండిన భారీ వృక్షం ఉండటంతో అసలు సమస్య . ఆ హై టెన్షన్ విద్యుత్ వైర్ల కింది నుంచి నిత్యం సదరు వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి ఈ హై టెన్షన్ విద్యుత్ వైర్లు వాహనాలకు అత్యంత తక్కువ ఎత్తులో ఉండటం, దానికి తోడు వర్షాకాలం కావటంతో ఈదురు గాలులు ఎక్కువగా వస్తూ ఉంటాయి ఆ గాలులకు ఈ ఎండిన భారీ వృక్షము విరిగి హై టెన్షన్ విద్యుత్ వైర్లపైన పడి అవి తెగి వాటి కింద నుంచి ప్రయాణిస్తున్న వాహనాల పైన పడితే పెను ప్రమాదం సంభవించి అటు ప్రాణం నష్టంతో పాటు ఆస్తి నష్టం ఏ విధంగా జరుగుతుందో తెలియంది కాదు. ఈ విధంగా జరగబోయే పెను ముప్పు కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తున్నా అధికారులు నిర్లక్ష్య ధోరణితో ఎందుకు ఉంటున్నారో తెలియటం లేదు గతంలో ఈ పరిసర ప్రాంతంలో విద్యుత్ వైర్లు తెగి పందులపై పడడంతో అవి అక్కడి కక్కడే మరణించడం, ఆ సమయం లో అక్కడ మనుషులు ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.తక్షణమే విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది జరగబోయే ముప్పును గుర్తించి ప్రమాద గంటికలు మ్రోగక ముందే ఆ ఎండిన భారీ వృక్షాలను తొలగించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించవలసిందిగా స్థానికులు కోరుకుంటున్నారు.

## ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి క్షమాపణలు చెప్పాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి క్షమాపణలు చెప్పాలని బిజెపి యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు తరుణ్ రెడ్డి డిమాండ్ చేశారు. భారతీయ జనతా యువమోర్చా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పట్నం కపిల్ అధ్యక్షతన మీడియా సమావేశం బిజెపి జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన సందర్భంలో సోషల్ మీడియాలో హిందూ మనోభావాలను కించపరిచే విధంగా పోస్ట్ చేసినా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తక్షణమే స్పందించి క్షమాపణ చెప్పినందుకుగాను ధన్యవాదాలు తెలిపారు. కానీ ఇప్పటివరకు పద్మావతి రెడ్డి స్పందించకపోవడం పట్ల మీడియా సమావేశంలో తీవ్ర విమర్శలు గుప్పించారు. క్షేమాపన చెప్పాలని, లేకుంటే బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆదోళన చేపడతామని హెచ్చరించా రు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్, బీజేపీ భువనగిరి పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, బిజెవైఎం జిల్లా అధికార ప్రతినిధి మంగు నర్సిం హ్మా రావు, పట్టణ అధ్యక్షుడు రమేష్ కోటి, నాయకులు పుల్ల శివ శంకర్, పొట్ట నవీన్, నాగు నరేష్, వంశి, రట్నపురం ప్రవీణ్, నెమలి నందు, కనుకుర్తి నవీన్, రాజు, రావుల సంతోష్, పృథ్వి, నరేష్,దిలీప్ పాల్గొన్నారు.

## సహకార బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/చింతలపాలెం:** సహకార బ్యాంకు సేవలను రైతులతో పాటు వివిధ వర్గాల ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సహకార కేంద్ర బ్యాంకు మేనేజర్ షేక్ మహిమూద్ అన్నారు.మంగళవారం మండల పరిధిలోని దొండ పాడు,వజినేపల్లి,బుగ్గమాధారం గ్రామాలలో సహకార బ్యాంకు ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా మేనేజర్ మహిమూద్ మాట్లాడుతూ బ్యాంకు వ్యవసాయ అనుబంధ రుణాలతో పాటు గోల్డ్‌లోన్స్, ఫిక్సిడ్ డిపాజిట్లు, లాకర్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.వ్యాపార,గ్రామీణ గృహ రుణాలు, విదేశాలలో విద్యను అభ్యసించేందుకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. సహకార బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను ఉమ్మడి మేళ్లచెర్వు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అబ్దుల్ రఫీ,ఎఫ్ఎల్‌సీ ఫీల్డ్ కో ఆర్డినేటర్ సతీష్,క్రాంతి, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్‌కు ఆహ్వాన పత్రిక అందించిన డాక్టర్ వంగపల్లి



**ప్రజాపక్షం/ఆలేరు :** ఈ నెల 23వ తేదీన ఆలేరులోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జరగబోయే యాదాద్రి భువనగిరి జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ప్రమాణస్వీకారం మహోత్సవ ఆహ్వాన పత్రికను రాష్ట్ర ప్రభుత్వ విప్పు ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యకు అందించారు. ప్రముఖ ధార్మికవేత్త ఐవిఎఫ్ తెలంగాణ రాష్ట్ర ధార్మిక పరిషత్ చైర్మన్ భక్తి రత్న అవార్డు గ్రహీత డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి స్వాతి నక్షత్రం సందర్భంగా యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి దర్శనార్థం వచ్చిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యని కలిసి ఐవిఎఫ్ యాదాద్రి జిల్లా ప్రమాణ స్వీకారానికి రావలసిందిగా ఆహ్వానించారు. ఐవిఎఫ్ తెలంగాణ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారావు, సికింద్రాబాద్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నార్ల నారాయణ, శివకుమార్, ఎర్రం నవీన్ తదితర ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

## 20న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



**ప్రజాపక్షం/ రామన్నపేట:** ఈనెల 20న నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ పూస బాలమణిబాలనర్సయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నులిపురుగుల నివారణ దినోత్సవంలో అధికారుల పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మెడికల్ ఆఫీసర్ అశ్వినికుమార్ మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలు అంగన్‌వాడి కేంద్రాల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందించడం జరుగుతుందని, భోజనం అనంతరం మాత్రలను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీడీవో యాకుబ్‌నాయక్, తహసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీటీసీ రమేష్, ఏపీవో వెంకన్న, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఈవో గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## చింతలపాలెంలో ఈదురుగాలులతో భారీ వర్షం

**ప్రజాపక్షం/చింతలపాలెం:** మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన భారీవర్షంతో మర్రిచెట్టు సెంటర్ నందు ఉన్న రావిచెట్టు వేర్లతో సమీపంలోని గంధం బుజ్జమ్మ ఇంటి మీద పడటంతో ఇల్లు ధ్వంసం అయింది.రావిచెట్టు కిందపడిపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. భారీ వర్షంతో విద్యుత్ స్తంభాలు సైతం ఒరగడంతో వైర్లు తెగిపోవడంతో దీంతో విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో విద్యుత్‌లో అంతరాయం ఏర్పడింది.

# మట్టి మాఫియాపై చర్యలేవి...

## చౌటుప్పల్‌లో చెరువుల మట్టితో కోట్ల రూపాయల దందా

## అనుమతులు లేకున్న అధికారుల కనుసన్నల్లో మట్టి తరలింపు



**ప్రజాపక్షం/ చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలంలోని చెరువులను కొంతమంది అక్రమార్కులు చెరపడుతున్నారు.చెరువు మట్టితో పెద్ద ఎత్తున కోట్ల రూపాయల దందా నడుస్తున్న కూడ పట్టించుకునే నాథుడు కరువయ్యారు. చెరువుల్లో తీసిన నల్ల మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. చౌటుప్పల్ మండలంలోని పంతంగి, దేవలమ్మనాగారం, కాట్రేవు, మునిసిపాలిటీలోని లక్కారం చెరువు, ఎర్రకుంటల నుండి గత కొద్ది రోజులుగా బంక మట్టిని యధేచ్ఛగా ఇటుక బట్టీలకు రాత్రి వేళల్లో అక్రమంగా తరలిస్తున్నారు. ఇరిగేషన్,రెవిన్యూ అధికారుల కనుసన్నల్లోనే పెద్ద ఎత్తున చెరువులల్లో మట్టి తరలుతుందని ఆరోపణలు ఉన్నాయి.

**అనుమతులు లేకున్న బరితెగించి ఇటుకబట్టీలకు తరలింపు**

చెరువులో మట్టిని తీయలంటే రెవిన్యూ, ఇరిగేషన్, మైనింగ్ శాఖల అనుమతులు తప్పని సరి. కాని అక్రమార్కులు కొంతమంది అధికారులకు, ప్రజాప్రతినిధిలకు చెతివాటాలు ఇస్తు రాత్రికి రాత్రే చెరువులోని మట్టితో వ్యాపారం చేస్తూ ప్రభుత్వానికి రావాల్సిన ఖజానాను కోల్లగోడుతున్నారు. చౌటుప్పల్ లో డివిజన్ స్థాయి ఇరిగేషన్ అధికారులు ఉన్న కూడ పటించుకునే వారు కరువయ్యారు. ఎంపి ఎన్నికలు ముందు మునిసిపాలిటీ పరిధిలోని లక్కారం చెరువులో ఉన్న పట్టా భూముల రైతులకు ఎకరానికి రూ.లక్షల్లో ఇచ్చి మభ్యపెట్టి అనుమతులు లేకున్నా అక్రమంగా మట్టిని ఇటుక బట్టీలకు తరలించారు. అయితే ఇరిగేషన్ అధికారుల నుండి తీసుకున్న అనుమతులు కేవలం 1500 క్యూబిక్ మీటర్లకు తీసుకుని సూమారు 12 ఎకరాల భూమిలో రాత్రి పూట మట్టిని తరలించారు. చెరువుల్లో మట్టిని మొత్తం తీయడం వల్ల నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండే అవకాశం లేదు. అయినా ప్రభుత్వ అధికారులు నిమ్మకునీరేత్తినట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలకు తావిస్తుంది.

**ఎమ్మెల్యే ఆదేశాలను సైతం పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు**

చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధిలోని లక్కారం చెరువును గత నాలుగు నెలల క్రితం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సందర్శించారు. చెరువును ఆధునీకరించి బలోపేతం చేయాలనే సంకల్పంతో ఉన్నారు. అయితే చెరువును సందర్శించినప్పుడు చెరువులో తీసిన మట్టిని చూసి ఆశ్చర్యపోయారు. అక్కడ ఉన్న ఇరిగేషన్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తు ,మట్టిని తరలించిన వారిపై విజిలేన్స్ విచారణ జరిపిస్తామని అసహనం వ్యక్తం చేశారు. ఎక్కడ కూడ చెరువు మట్టిని తీయోద్దని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాటాలను లెక్కచేయకుండా ఎంపి ఎన్నికలు పూర్తవగానే లక్కారం చెరువు నుండి తిరిగి అక్రమంగా మట్టిని తరలించారు. ఇరిగేషన్, రెవిన్యూ అధికారులకు ధర్మాజీగూడెం గ్రామస్తులు పిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆలస్యంగా తెలుస్తుంది. గత ఆదివారం రాత్రి నుండి యధేచ్ఛగా మళ్లి చెరువు మట్టిని తరలిస్తున్న కూడ అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారి వివరాలు ఉన్న కూడ ఇరిగేషన్ అధికారులు పోలీసులకు పిర్యాదు చేయడంలో కూడ ఆలసత్వం చేస్తున్నారని ప్రజలు చెప్తున్నారు.ఇప్పటికైనా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చోరవ తీసుకోని చెరువులను కాపాడాలని చెరువు కింది రైతులు విన్నవిస్తున్నారు.

**అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు : ఉప్పు కృష్ణ, తెలంగాణ ఉద్యమకారులు**



చౌటుప్పల్ మండలంలో చెరువు మట్టిని విచ్చల విడిగా ఇటుక బట్టీలకు అక్రమంగా తరలిస్తున్నారు. చెరువుల్లో మట్టిని పూర్తిగా తీయడం వల్ల భూగర్భ జలాలు పెరిగే అవకాశాలు తగ్గుతాయి. గతంలో లక్కారం చెరువు నుండి రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా చెరువు మట్టిని తరలిస్తున్నారని ఇరిగేషన్, రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన కూడ పట్టించుకోలేదు. రైతులు పోలాల్లోకి చెరువు మట్టిని పోసుకుంటామని అధికారలకు చెప్పితే అనుమతులు లేవని నిలిపివెస్తున్నారు. కానీ మట్టి మాఫియాతో చెతులు కలిపి చెరువు మట్టిని తరలిస్తున్న కూడ తెలియనట్లు ఉంటున్నారు. చెరువు మట్టి మాఫియపై పూర్తి విచారణ జరిపించాలి. చెరువు మట్టి తరలింపును అడ్డుకట్ట వేయాలి.

# హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం

## కాంగ్రేస్ కుట్ర రాజకీయాలను మానాలి

## జడ్‌పిటిసి కర్నాటి వెంకటేశం

**ప్రజాపక్షం/చండూరుః** ఎన్నికల సమయంలో కాంగ్రేస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, చండూరు జడ్‌పిటిసి కర్నాటి వెంకటేశం అన్నారు. మంగళవారం ఆయన చండూరులో ఏర్పాటు ఏర్పాటు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.చండూరు ఎంపిపి పదవి కాంగ్రేస్ పార్టీకి సరిపోను బలం లేకున్న వారు చేసిన కుట్రలు ,కుయుక్తులు పారలేదని అన్నారు. చండూరు ఎంపిపిని బిఆర్ఎస్ కైవసం చేసుకోవడం సంతోషకరమన్నారు. ఇప్పటికైన కాంగ్రేస్ చేస్తున్న కుట్ర రాజకీయాలను మానుకోవాలని హితవుపలికారు. ఎంపిపి కైవసం చేసుకోవడంలో బిఆర్ఎస్ సఫలం అయ్యిందని, కాంగ్రేస్ విఫలం అయ్యిందని అన్నారు. అనంతరం చండూరు ఎంపిపిగా నూతనంగా ఎన్నికైన అవ్వారు గీతశ్రీనివాస్‌ను జడ్‌పిటిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు గొరిగె సత్తయ్య, చెరుపల్లి భాస్కర్, కావలి మంగమ్మ, ప్రసాద్, తిప్పర్తి లక్ష్మమ్మ , అవ్వారు శ్రీను పాల్గొన్నారు.

# ప్రజల కోసం ఒక బృందంగా పనిచేద్దాం

## జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి :** ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, సిబ్బంది అందరూ కలిసి ఒక బృందంగా పనిచేద్దామని సమస్యల పరిష్కారంలో వారికి నమ్మకాన్ని, భరోసాను కల్పించాల్సిన అవసరం ఉందని నూతన జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో సమావేశం అయ్యారు రెవెన్యూ అంశాలతో పాటు, ప్రజలకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు చొరవ చూపించాలని అన్నారు. ప్రత్యేకించి పెండింగ్లో ఉన్న ధరణి దరఖాస్తులన్నింటిని రానున్న 15 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఇందుకుగాను మండల స్థాయి నుంచి మొదలుకొని జిల్లా స్థాయి వరకు అధికారులు సిబ్బంది ఒక బృందంగా పని చేద్దామని చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించినట్లుగానే , ఇకపై మండల స్థాయిలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని , వచ్చే సోమవారం నుండి మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని, ఇందుకుగాను మండల స్థాయిలో అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా పరిష్కారమయ్యే వాటిని వెంటనే పరిష్కరించడం, కాని వాటికి ఒక దారి చూపించడం చేయాలని, జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం అద్భుతంగా జరిగేలా సహకరించాలని కోరారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న అన్ని ధరణి దరఖాస్తులను 15 రోజుల్లో పూర్తి చేయాల్సిందిగా పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధరణికి సంబంధించి జివిల్ఎం, కోర్టు కేసులు, జిపిఏ ,నాలా, సక్సెసన్, మిస్సింగ్ సర్వే నంబర్ ,టిఎం 33 తదితరఅన్ని అంశాలపై రెవెన్యూ అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆర్‌డిఓలు వారి డివిజన్కు సంబంధించి పూర్తి నియంత్రణ కలిగి ఉండాలని, వారి లాగిన్ లో ఉన్న అన్ని పిటీషన్లను పెండింగ్లో ఉంచుకోవద్దని తెలిపారు. సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, నల్లగొండ ,మిర్యాలగూడ, దేవరకొండ ఆర్‌డిఓలు రవి, శ్రీనివాసరావు ,శ్రీరాములు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ డి శ్రీనివాసులు, అన్ని మండలాల తహసిల్దారులు, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మోతిలాల్, ఆయా విభాగాల పర్యవేక్షకులు, పాల్గొన్నారు.

# పెద్ద చెరువు తూముకు మరమ్మతు పనులు చేపట్టాలని తహసీల్దార్‌కు వినతి

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం నూనెగూడెం పెద్దచెరువు తూముకు మరమ్మత్తు పనులు చేపట్టాలని కోరూతు గుండాల తహశీల్దార్ జలకుమారికి ఆయకట్టు రైతులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. గత సంవత్సర కాలంగా తూము నుండి నీటి విడుదల నిలుపుదల చేయడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయమై మండల నీటి పారుదల శాఖ ఇంజనీర్లకు ఇక్కడ పనిచేసిన తహశీల్దార్‌కు పలుమార్లు మొరపెట్టుకున్న తూము మరమ్మతులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం వర్షాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో చెరువు నిండితే తూము నుండి నీరు వృదాగా పోయి ప్రమాదం ఉందని తూము మరమ్మతులు చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్, మాధవరెడ్డి, రైతులు చిటికలయ్య, రాంరెడ్డి, రాతశరెడ్డి, రాములు, ఎల్లయ్య, అనిల్‌రెడ్డి, సోమిరెడ్డి, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

# కారోబార్, బిల్ కలక్టర్ పెండింగ్ వేతనాలు చెల్లించాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** కారోబార్ బిల్ కలక్టర్, సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలని జిల్లా పంచాయతీ అధికారికి పలువురు కారోబార్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డేబోయిన వెంకటేష్ మాట్లాడుతూ గత 5 నెలల నుండి పెండింగ్‌లో ఉన్న వేతనాలు, సమ్మె కాలేం వేతనాలు చెల్లించాలి అని డిమాండ్ చేసారు. జిఓ 51ను రద్దు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుదుల లింగాస్వామి, జిల్లా ఉప అధ్యక్షులు బొపతి బాల చందర్, కట్కూరి స్వామి, దేవుళ్ళ స్వామి, పి.స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార పోరాటాలకు సిద్ధం




**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** దేశంలోని గాని, రాష్ట్ర ములోని గాని ఎన్నికల వాతావరణం ముగిసిందని రాష్ట్రంలో ప్రజా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రీకరించాలని, ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిపిఎం మండల కార్యదర్శి చెరుకు పెద్దులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నార్కట్ పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను, ఆరు గ్యారెంటీలను పకడ్బందీగా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు విత్తనాలను ఎరువులు సక్రమంగా అందించి నకిలీ విత్తనాలు అరికట్టాలని అన్నారు.ఈ నెల 19 ,20, 21 తేదీలలో హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సిపిఐ(ఎం) పార్టీ రాజకీయ శిక్షణ తరగతులకు నార్కట్ పల్లి మండలం నుంచి 15 మందిని ఎంపిక చేయడం జరిగిందని, ప్రతినిధులు అందరూ ఈ క్లాసులలో పాల్గొని నిజయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కల్లూరి యాదగిరి, మండల కమిటీ సభ్యులు దండు రవి, దండు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలల బస్సులను సీజ్ చేయాలని బీసీ విద్యార్థి సంఘం, మాలమహానాడు విద్యార్థి సంఘం నాయకులు అన్నారు. మంగళవారం ఎంవీఐ వీరస్వామికి వారు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, మాలమహానాడు విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రవిలు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేకుండా బస్సులను నడిపి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. పాత బస్సులను కొనుగోలు చేసి వాటికి రంగులు వేసి ఫిట్నెస్ ఉన్నట్లు చూపుతున్నారని ఆరోపించారు. ఎంవీఐ వెంటనే స్పందించి ప్రైవేట్ పాఠశాలల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, గౌస్, నాగరాజు, గోపి, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

